# సింగిల్ పేజీ కథలు

## తీర్పు

ఉదయిని ఆఫీసు నుంచి రాగానే తల్లి తొందర పెట్టింది త్వరగా తయారుకమ్మని.

ఆ రోజు సాయంకాలం ఉదయినికి పెళ్లిచూపులు.

పెళ్లిచూపుల తతంగం పూర్తయింది.

ఉదయిని మగపెళ్లి వారికి నచ్చింది. ఆ విషయం ఇంటికెళ్లి తెలియజేస్తామనో, ఉత్తరం రాస్తామనో నాన్చ కుండా అప్పటికప్పుడే డిక్లేర్ చేయడం ఉదయిని తండ్రికి సంతోషం కలిగించింది. కట్నం, లాంఛనాలు, ఇచ్చిపుచ్చుకోవడాల విషయంలో కూడా అంగీకారం కుదిరింది.

ఇక పురోహితుడిని పిలిపించి లగ్నపత్రిక రాయించడమే తరువాయి.

ఆ సమయంలో వరుడు అజయ్ ఒక షరతు పెట్టాడు.

"ఉదయిని తక్షణం ఉద్యోగం మానెయ్యాలి"

అందరి దృష్టీ ఉదయిని మీద కేంద్రీకృతమైంది.

"నాన్నా! నేను ఆయనతో మాట్లాడాలి" అంది ఉదయిని.

కాబోయే దంపతులు మాట్లాడుకోవడం మంచి సాంప్రదాయమే అని పెద్దవాళ్లు వాళ్లకి ఏకాంతం కల్పించారు.

"నన్ను ఉద్యోగం ఎందుకు మానెయ్యమంటున్నారు?" ప్రశ్నించింది ఉదయిని.

"నా భార్య ఉద్యోగం చెయ్యడం నాకు ఇష్టం ఉండదు" చెప్పాడు అజయ్.

"అటువంటప్పుడు పెళ్లిచూపులకు ఎందుకొచ్చారు? నేను ఉద్యోగం చేస్తున్నానని మీకు ముందుగా తెలుసు కదా?"

"తెలుసు. కానీ మా ఇంటికి వచ్చాక మా ఇష్ట ప్రకారం నడుచుకోవాలని నీకూ తెలుసనుకుంటాను"

"తెలుసు. కానీ ఇది ఆర్థిక స్వాతంత్ర్యం గురించి కదా? నాకు నాది అని సంపాదన ఉండడం కూడా ఈ రోజుల్లో ఎంతో ముఖ్యం కదా?"

"నేను నెలకు పదివేలు సంపాదిస్తున్నాను. నాది అనేది నీదే కదా? ఇంకా నీకు వేరే సంపాదన ఎందుకు?"

"ఇద్దరికీ సంపాదన ఉంటే మంచిదే గదా?"

"ఆ అవసరం లేదనే కదా నేను చెప్పేది"

"మీరు కోపరేటివ్ బ్యాంక్‌లో జాబ్ చేస్తున్నారు. అది ఎన్నాళ్లుంటుంది? మీ జీవితాంతం ఉంటుందని నమ్మకం ఉందా? ఇప్పుడు చాలా కోపరేటివ్ బ్యాంకులు దివాలా తీస్తున్నాయి కదా?"

"జాబ్ పోయినా మాకు స్వంత ఇల్లుంది"

"ఆ ఇల్లు మీరు సంపాదించి కట్టింది కాదుగా! మీ నాన్నగారిది. మీకు జాబ్ పోతే మీరు మీ నాన్నగారికొచ్చే పెన్షన్ మీద ఆధారపడి బతకవలసిందే కదా? అటువంటి పరిస్థితి రాకుండా ఉండడానికి నేను జాబ్‌లో ఉండడం అవసరమే కదా?"

ఉదయిని మాటలు అజయ్‌కి పలుకురాళ్లలా తగులుతున్నాయి. జీర్ణం కావడం లేదు. సాలోచనగా ఆమె



వైపు చూశాడు. ఆమెలో ఏ విధమైన టెన్షన్ లేదు. ఆమె ముఖం ప్రశాంతంగా ఉంది.

"ఏదేదో జరగబోతుందని ఊహించుకోవడం ఇప్పుడు అంత అవసరమా?"

"కీడెంచి మేలెంచమన్నారుగా?"

"నువ్వు అనుకున్నట్లు జరిగినా నీ మీద ఏ విధమైన భారం పడకుండా చూసే బాధ్యత నాది" అన్నాడు అజయ్.

"ఏదో భారం నా మీద పడుతుందనే భయం నాకు లేదు. ఆడదానికి కూడా ఆర్థిక స్వతంత్రం ఉండాలనేది నా అభిప్రాయం. ప్రతి అవసరానికి మీ మీద ఆధారపడడం నాకు ఇష్టం లేదు. నా అవసరాలు మీకు అనుచితమని అనిపించవచ్చు. మీరు డబ్బు ఇవ్వడానికి బాధ పడవచ్చు"

"ఇంతకీ నువ్వు చెప్పేదేమిటి? జాబ్ మానడం ఇష్టం లేదనేదేగా?" అసహనం ప్రదర్శిస్తూ అన్నాడు అజయ్.

"నాకు ఆర్థిక స్వతంత్రం కావాలని మాత్రం అంటున్నాను"

"డొంకతిరుగుడుగా దాని అర్థం అదేగా?"

"నేను జాబ్ చేస్తుంటే మీకు ఇబ్బంది ఏమిటి? అభ్యంతరం ఎందుకు?" ప్రశ్నించింది ఉదయిని.

"జాబ్ చేస్తూ ఇంటిని సరిదిద్దుకోవడం చాలా కష్టం. గృహిణి బాధ్యత మహత్తరమైనది. అంత తేలికైనది కాదు. జాబ్ చేస్తుండడం వల్ల గృహిణిగా విఫలమయ్యే అవకాశం కూడా ఉంది. చాలామంది వంట ఇంటికే పరిమితమైందని ఆడదాన్ని చాలా తేలిగ్గా చూస్తారు. కాని అది సరికాదు. ఇల్లాలి బాధ్యత చాలా విలువైనది" చెప్పాడు అజయ్.

"ఇల్లాలి బాధ్యత మీద మీకు మంచి అవగాహన ఉంది. అందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను" అంది ఉదయిని.

అజయ్ సంతోషించాడు.

"థాంక్యూ!" అన్నాడు.

"ఒక షరతు మీద నేను ఉద్యోగం మానేస్తాను" అంది ఉదయిని.

"ఏమిటి?"

"ఇల్లాలి పోస్ట్ చాలా విలువైనదని ఈమధ్య సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అందుకుగాను ఆ శ్రమ విలువ నెలకు మూడు వేల రూపాయలు ఉంటుందని తీర్మానించింది. మీరు ఆ విధంగా నాకు నెలనెలా మూడువేలు నాకు పాకెట్ మనీగా ఇవ్వడానికి ఒప్పుకుంటే మీరు కోరిన విధంగా జాబ్ మానేస్తాను" చెప్పింది ఉదయిని.

అజయ్ షాక్ తిన్నట్లు చూశాడు.

"నేను ఈ విషయం మా ఫ్యామిలీతో డిస్కస్ చేసి తెలియజేస్తాను" అన్నాడు.

"మీ ఇష్టం" అంది ఉదయిని.

తర్వాత మగపెళ్లివాళ్లు వెళ్లిపోయారు. ఎన్నాళ్లికీ వాళ్లు తమ నిర్ణయం తెలియజేయలేదు. ఉదయిని తండ్రి ఉండబట్టలేక మధ్యవర్తితో కబురు పంపితే వారికి అమ్మాయి నచ్చలేదని చెప్పి పంపారు.

-వాణిశ్రీ (హైదరాబాద్)